సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం । 3 । సెప్టెంబర్ । 2023



జడ్చర్లలో గంజాయి పట్టివేత

జడ్చర్ల సమీపంలో రూ.40 లక్షల విలువైన 207 కిలోల గంజాయి పట్టుబడింది.

వివరాలు 8లో ▸



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ఉమ్మడి జిల్లాలోని ఏడుగురికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వచ్చాయి.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 37.2/24.8

వాతావరణం

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు కేజీబీవీలో సర్టిఫికెట్ల పరిశీలన

గద్వాల: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీల భర్తీకి ఆదివారం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని డీఈఓ సిరాజుద్దీన్ తెలిపారు. కేజీబీవీలో తాత్కాలిక, ఒప్పంద ప్రాతిపదికన ఉపాధ్యాయుల నియామకానికి పరీక్ష రాసిన అభ్యర్థుల నియామకం తర్వాత ఏర్పడిన ఖాళీల భర్తీకి సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నట్లు తెలిపారు. సీఆర్టీ బయోసైన్స్–1, సీఆర్టీ ఇంగ్లిష్–1, పీజీ సీఆర్టీ ఫిజిక్స్–2 భర్తీకి 1:3 నిష్పత్తిలో రోస్టర్ కమ్ మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసి సర్టిఫికెట్ల పరిశీలన చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా అభ్యర్థుల మొబైళ్లకు సమాచారం అందించామని, ఉదయం 11 గంటలకు విద్యాశాఖ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు.

వీఆర్‌ఏలకు రెండురోజుల శిక్షణ పూర్తి

గద్వాల అర్బన్: వీఆర్‌ఏలకు సర్దుబాటులో భాగంగా మిషన్ భగీరథ శాఖలో సహాయకులుగా నియమించబడిన వారికి శుక్ర, శని వారాల్లో వారాల్లో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ధరూరు మండలంలో రేవులపల్లిలోని 70ఎంఎల్‌డి డబ్ల్యూటీపీ వద్ద నీటి శుద్ధి విధానం, క్లోరినేషన్, బల్క్ సరఫరా, నీటి నాణ్యత పరీక్షలపై ప్రయోగశాలలో వివరించారు. అదేవిధంగా గద్వాల మండలం మేలచేర్వులో ఇంట్రా విలేజీ సంబంధించిన ఇంట్రా వ్యవస్థ, క్లోరినేషన్ విధానంపై క్షేత్రస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ పర్యవేక్షకులు జగన్‌మోహన్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీధర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పదోన్నతి బాధ్యతను పెంచుతుంది..

గద్వాల క్రైం: పదోన్నతి బాధ్యతను మరింత పెంచుతుందని ఎస్పీ సృజన అన్నారు. 1999 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ నాగరాజు, వెంకటస్వామి, తులసిరెడ్డి, శ్రీధర్.. హెడ్‌కానిస్టేబుల్‌గా ఇటీవల పదోన్నతి పొందారు. ఈమేరకు శనివారం ఎస్పీ కార్యాలయంలో వారిని ఎస్పీ అభినందించారు. పోలీసుశాఖపై ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని, సమస్యలపై వచ్చే బాధితులకు మనోధైర్యం కల్పించాలని అన్నారు.

రేపు ఉచిత ఉపకరణాల పంపిణీ

గద్వాల: సమగ్ర శిక్ష, అలింకో సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఈ నెల 4వ తేదీన స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచితంగా ఉపకరణాల పంపిణీ చేయనున్నట్లు డీఈఓ సిరాజుద్దీన్, జిల్లా సమన్వయ అధికారి హంపయ్య తెలిపారు. గతంలో అసెస్మెంట్ క్యాంపు ద్వారా ఎన్నికైన విద్యార్థులకు మాత్రమే ఈ ఉపకరణాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం



శాంతినగర్: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకుందామని.. ఇంటింటికి పిడికెడు మట్టిని సేకరించి దేశ రాజధానిలో స్మారక వన నిర్మాణం నిమిత్తం పంపుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆజాదీకా అమృత్ మహోత్సవం ముగింపు, నాభూమి నాదేశం మట్టి సేకరణ కార్యక్రమాన్ని ఆయన వడ్డేపల్లి మండలం తిమ్మాజిపల్లిలో శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ అమరవీరులు, అమర జవాన్లు, స్వాతంత్ర పోరాట యోధుల జ్ఞాపకార్థం దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించనున్న స్మారక వనానికి మట్టిని పంపుదామన్నారు. 75 సంత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో అమృతవాటికను నిర్మిస్తున్నారన్నారు. 25న రాష్ట్రాలకు, 30 లోపు మట్టి కుండలు ఢిల్లీకి పంపుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, జిల్లా కార్యదర్శి స్వప్న, మాణిక్యరెడ్డి, హరికృష్ణ, ఆంజనేయులు, శ్రీను, రాఘవేంద్ర, వెంకటేష్, పురుశరాం, జానకిరాం, మహేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులొచ్చాయ్

జిల్లాకు రూ.152.30 కోట్ల ప్రత్యేక నిధులు



వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో సుందరీకరణలో భాగంగా కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

- నాలుగు మున్సిపాలిటీలకు రూ.125 కోట్లు
- 12 మండల కేంద్రాలకు రూ.1.80 కోట్లు
- 255 పంచాయతీలకు రూ.25 కోట్లు కేటాయింపు
- దీర్ఘకాలికంగా పేరుకున్న సమస్యలకు పరిష్కారం



అలంపూర్: జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి నిధులొచ్చాయి. మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల్లో పనులు చేపట్టడానికి వీలుగా సీఎం కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించారు. మున్సిపాలిటీలకు గతంలో అడపడపాగా నిధులు వచ్చాయి. కానీ పంచాయతీలకు ప్రభుత్వం నేరుగా నిధులొచ్చిన పరిస్థితి లేదు. దీంతో అనేక గ్రామ పంచాయతీల్లో నిధుల లేమితో పనులు చేయలేక ప్రజా ప్రతినిధులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. జిల్లాను పర్యటించిన సీఎం కేసీఆర్ ప్రతి పంచాయతీకి నిధులు కేటాయించడంతో అభివృద్ధి పనులపై ఆశలు చిగురిస్తున్నాయి. దీంతో మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో దీర్ఘకాలికంగా పేరుకున్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందనే ఆశాభావం వ్యక్తం అవుతోంది.

నాడు హామీ.. నేడు అమలు

ఈ ఏడాది జూన్ 12వ తేదీన సీఎం కేసీఆర్ జిల్లాను సందర్శించారు. కలెక్టర్ సమీకృత కార్యాలయం, ఎస్పీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభలో జిల్లాకు వరాలు కురిపించారు. జిల్లాలో ఉన్న నాలుగు మున్సిపాలిటీలకు, మండల కేంద్రాలకు, గ్రామ పంచాయతీలకు అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు ప్రత్యేక అభివృద్ధి కింద రూ.152.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత నెల 29వ తేదిన జిల్లాకు ప్రత్యేక నిధులను మంజూరు చేస్తూ జీఓ నెంబర్ 354 విడుదల చేశారు. గద్వాల మున్సిపాలిటీకి రూ.50కోట్లు, అయిజ, వడ్డేపల్లి, అలంపూర్‌కు రూ.25కోట్ల చొప్పున మంజూరు చేస్తూ పాలన అనుమతులు ఇవ్వడం జరిగింది. అలాగే, 12 మండల కేంద్రాలకు ఒక్కోదానికి రూ.15 లక్షలు, 255 గ్రామ పంచాయతీలకు రూ. 25.50 కోట్లు కేటాయించారు.



అయిజ మున్సిపాలిటీలో నిర్మించిన డివైడర్

ప్రత్యేక నిధులు రావడంతో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. మున్సిపాలిటీలను సుందరీకరించడానికి ప్రత్యేక నిధులతో పనులు చేపడుతోంది. అయిజ మున్సిపాలిటీలో టీయూఎఫ్‌ఐడీసీ రుణంలో భాగంగా రూ. 15 కోట్లతో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. రూ.6 కోట్లతో డివైడర్, సెంట్రల్ లైటింగ్, రూ. 9 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల పనులు కొనసాగుతున్నాయి. గద్వాల మున్సిపాలిటీలో డివైడర్ విత్ సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి

అభివృద్ధి పనులు వేగవంతం

కావడంతో రూ. 2.40 కోట్ల వ్యయంతో డివైడర్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అలంపూర్ మున్సిపాలిటీలో రూ.10 కోట్ల వ్యయంతో సుందరీకరణ, రూ. 3.50 కోట్లతో డివైడర్, సెంట్రల్ లైటింగ్, రూ.1.50 కోట్లతో మున్సిపల్ భవనం, రూ. 5 కోట్లతో 10 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇతర పనులు చేపడుతున్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో సుందరీకరణకు రూ. 10 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఇక్కడ రూ. 3.50 కోట్లతో డివైడర్, సెంట్రల్ లైటింగ్, రూ. 5 కోట్లతో వార్డులల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయి. అదేవిధంగా, ఒక్కో పంచాయతీకి రూ. 10 లక్షలు, మండల కేంద్రానికి రూ. 15 లక్షలు కేటాయించడంతో సర్పంచ్‌ల్లో కొంత ఊరట చెందుతున్నారు. నిధులతో కొంత మేర అభివృద్ధి పనులు చేపట్టేందుకు వీలవుతుందని.. దీర్ఘకాలికంగా పేరుకున్న సమస్యలకు పరిష్కారం చూపవచ్చని పేర్కొంటున్నారు.

ఊతమవుతాయి..



మున్సిపాలిటీకి సీఎం కేసీఆర్ రూ.25 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. ప్రత్యేక నిధులతో మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతో ఊతమిస్తాయి. సమగ్ర ప్రణాళికలతో వచ్చిన నిధులు సద్వినియోగం చేసుకుంటాం. నిధులిచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

– మనోరమ, మున్సిపల్ చైర్‌పర్సన్, అలంపూర్

సమస్యల పరిష్కారానికి చర్యలు



సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీలకు ప్రత్యేకంగా రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. పంచాయతీల్లో అనేక సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. వీటన్నింటి పరిష్కారానికి ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయి. కానీ, గతంలో మాదిరి నిధుల ఖర్చులో నిబంధనలు పెట్టొద్దు. అప్పుడే వచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం ఉంటుంది.

– లోకేశ్వర్ రెడ్డి, ఉండవెల్లి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, ఇటిక్యాలపాడు

2 గంటలు.. 50 మంది

ముగ్గురు మంత్రులు.. ఒక ఎమ్మెల్యే.. ఒక ఎమ్మెల్సీ

- కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అసమ్మతులతో భేటీ
- వాడీవేడిగా చర్చ.. ప్రాధాన్యత దక్కడం లేదని ఏకరువు
- జైపాల్‌యాదవ్‌ను మార్చాలని ముక్తకంఠంతో డిమాండ్
- సర్వేల్లో తేలిన ప్రకారం కసిరెడ్డికి టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి
- సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తాం.. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు
- మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, వేముల హితవు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి అన్ని పార్టీల కంటే ముందుగా అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. ఆ తర్వాత రాజకీయ పరిణామాల క్రమంలో అసమ్మతి స్వరాలు ఊపందుకున్నాయి. ఈ మేరకు దృష్టి సారించిన పార్టీ అధిష్టానం నష్టనివారణ చర్యలకు ఉపక్రమించింది. అసంతృప్త నేతలతో సంప్రదింపులకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉమ్మడి పాలమూరుపైన ప్రత్యేక నజర్ వేసింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. అన్ని సీట్లను సిట్టింగ్ ఎమ్మెల్యేలకే కేటాయించారు. అయితే ప్రధానంగా కల్వకుర్తి నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను మార్చాలంటూ అసమ్మతి నేతలు మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ నిరసన గళం వినిపిస్తున్నారు. దీంతో రంగంలోకి దిగిన ట్రబుల్ షూటర్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం బాలాజీసింగ్ తదితరులతో భేటీ అయ్యారు. తాజాగా శనివారం హైదరాబాద్‌లో అసమ్మతి నేతలు సుమారు 50 మందితో పాటు కల్వకుర్తి టికెట్‌ను ఆశించి భంగపడిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డితో హరీశ్‌రావు, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భేటీ అయ్యారు. సుమారు రెండు గంటల పాటు వారి మధ్య వాడీవేడిగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

మాకు ప్రాధాన్యత లేదు..
ప్రజల్లో ఆయనపై నమ్మకం లేదు..

సుదీర్ఘ చర్చలో భాగంగా అసమ్మతి నేతలు పలు సమస్యలను పెద్దల దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిసింది. తమను ఎమ్మెల్సీ కసిరెడ్డి వర్గం అంటూ ఎమ్మెలే జైపాల్‌యాదవ్ పూర్తిగా పక్కన పెట్టారని.. పార్టీ పదవులు, ప్రభుత్వ కార్యకలాపాల్లో దూరం పెట్టడంతో పాటు ప్రభుత్వ పథకాలను పేదలైనప్పటికీ తమ వార్డులు, గ్రామాలకు చెందిన ప్రజల దరిచేరకుండా ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరించినట్లు పలు ఉదాహరణలను పెద్దల ముందు ఉంచారు. ఇటు పార్టీలో, అటు ప్రజల్లో ఎమ్మెల్యేపై నమ్మకం లేదని.. అభ్యర్థిని మార్చి నియోజకవర్గంలో పార్టీని కాపాడాలని వేడుకున్నట్లు సమాచారం. సమన్వయం చేసుకునే తీరిక ఆయనకు లేదని.. కల్వకుర్తి నియోజకవర్గానికి ఒక్కటంటే ఒక్క ప్రత్యేక ప్రయోజనం చేకూర్చిన దాఖలాలు లేవంటూనే.. సర్వేల్లో గెలుస్తారని తేలిన కసిరెడ్డికే టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది.

రేవంత్ ఇలాకా అనే ప్రత్యేక నజర్ ?

బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల ఖరారు తర్వాత రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అసమ్మతి సెగలు భగ్గుమంటున్నాయి. పలు జిల్లాల్లో అసమ్మతి నేతలు నిరసన ప్రదర్శనలకు దిగిన సందర్భాలు సైతం ఉన్నాయి. అయినా పార్టీ అధిష్టానం పెద్దగా స్పందించిన దాఖలాలు లేవు. అయితే కల్వకుర్తిలో అసమ్మతి గళంపై బీఆర్‌ఎస్ పెద్దలు దృష్టి సారించడం.. ఏకంగా ముగ్గురు మంత్రులు, ఓ ఎమ్మెల్యే అసమ్మతి నాయకులతో రెండు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించడం రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. టీపీసీసీ చీఫ్ రేవంత్ సొంత ఇలాకా కావడంతో పాలమూరుపై సీఎం కేసీఆర్ ప్రత్యేక నజర్ వేశారని.. ఒక్క సీటు కూడా కోల్పోవద్దనే ఉద్దేశంతో ఆయన పకడ్బందీగా ముందుకు సాగుతున్నట్లు బీఆర్‌ఎస్ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు..

అసమ్మతి నేతల అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాత ముగ్గురు మంత్రులు మాట్లాడుతూ మీ అభిప్రాయాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పినట్లు పార్టీ విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కల్వకుర్తి నియోజకవర్గంలో కొంత అసంతృప్తి ఉన్నట్లు తెలుసని.. మరి ఇంతస్థాయిలో ఉందని ఇప్పుడే గ్రహించినట్లు పేర్కొన్న వారు.. ఎవరు కూడా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని.. సీఎం కేసీఆర్ ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తారని.. ఇందులో ఎలాంటి అపనమ్మకాలకు తావులేదంటే అసమ్మతి నాయకులకు పలు సూచనలు చేసినట్లు సమాచారం. సామాజిక సమీకరణల నేపథ్యంలో పెద్దాయన ఓ నిర్ణయం తీసుకున్నారని.. మీ అభిప్రాయాలను సైతం సీఎం దృష్టికి తీసుకెళ్తామని పునరుద్ఘాటించినట్లు వినికిడి. త్వరలో మళ్లీ భేటీ అవుదామని.. పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సమావేశం ముగించినట్లు తెలుస్తోంది. సమావేశంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్‌తో పాటు ఆమనగల్లు, కడ్తాల్ ఎంపీపీ అనితా విజయ, కమ్లీ మోత్యానాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అశోక్ రెడ్డి, ఇర్విన్ రవి, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్ రెడ్డి, ఆనంద్‌కుమార్, కొండల్‌రెడ్డి, సంజీవ్ యాదవ్, కేశవులు, జంగయ్య, జిల్లెల రాములు, భాస్కర్ రెడ్డి, రమేష్‌యాదవ్, కృష్ణ, షాన్‌వాజ్ ఖాన్, రాజశేఖర్, రామకృష్ణ, హన్మనాయక్, పదిమంది సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు వందశాతం చేపట్టాలి



పోలింగ్ బూత్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: ఇంటింటికి తిరిగి అర్హులైన వారందరికి ఓటరు నమోదు ప్రక్రియ వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాల సందర్భంగా ఆమె శనివారం గద్వాలలో పలు పోలింగ్ బూత్‌లను సందర్శించారు. ప్రత్యేక శిబిరాల తీరుతెన్నులను పరిశీలించారు. ఫాం–6 కింద ఎన్ని దరఖాస్తులు వచ్చాయని విచారించారు. ఈసందర్భంగా ఓటరు జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితాలో పేర్లు తొలగించే ప్రక్రియలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మరణించి వారుంటే వారి కుటుంబ సభ్యుల నుంచి మరణ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలన్నారు. వివిధ కారణాల వల్ల బూత్‌లు మారినట్లయితే విషయాన్ని క్షేత్రస్థాయిలో ఓటర్లకు తెలియజేసి అందుకు గల కారణాలను స్పష్టంగా చెప్పాలన్నారు. అర్హులైన వారికి ఓటరు జాబితాలో పేర్లు లేకుంటే వారిని గుర్తించి నమోదు చేయాలన్నారు. అదేవిధంగా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు గద్వాల మండలంలోని వీరాపురం, జమ్మిచేడు పరిధిలోని పోలింగు కేంద్రాలను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా పోలింగు బూతుల సిబ్బంది, అధికారులకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

ఎన్నికల నిర్వహణ సమయంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరముందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం ఆమె రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని క్రిటికల్ పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా ఓటరు నమోదు దరఖాస్తులపై ప్రతిరోజు నివేదిక అందించాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తులు నమోదు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు పంపిణి చేయాలన్నారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్, స్వీప్‌నోడల్ అధికారి రమేష్‌బాబు, ఆర్డీవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత

మల్దకల్: పేదల అభ్యున్నతే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని.. పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పీచైర్‌పర్సన్ సరిత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. తిరగబడదాం.. తరిమికొడదాం పోస్ట్ కార్డు కార్యక్రమంలో భాగంగా శనివారం బిజ్వారం, దాసర్‌పల్లి, మేకలసోంపల్లి, మల్దకల్, మద్దెలబండ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డామె మాట్లాడుతూ.. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదలను ఆదుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ముందుచూపుతో ప్రాజెక్టులు నిర్మించి అండగా నిలిచారన్నారు. అంతకు ముందు బిజ్వారంలో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బండ్ల చంద్రోశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, శ్రీనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్‌గౌడు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉదయ్‌కుమార్

అలంపూర్: విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని.. దానిని చేరుకునేందుకు నిరంతరం కష్టపడాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉదయ్‌కుమార్ అన్నారు. అలంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడుతూ భవిష్యత్తులో ఏం కావాలి అనుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, లక్ష్యాలను చేరుకునేందుకు నిరంతరం సాధన చేయాలన్నారు. భవిష్యత్తులో ఉన్నత హోదాల్లో రాణించాలని ఆకాంక్షించారు. వీరితోపాటు స్థానిక ఎస్‌ఐ రమేష్, అధ్యాపకులు సృజన, సుధారాణి, వెంకటరాణి, ఎస్ రాముడు, రాజు, ఎం రాముడు, రఘువీర్ కుమార్, వేణుగోపాల్, షేక్షావలి, రాఘవేంద్ర, శ్రీనివాసులు ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను శనివారం జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌కుమార్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారి పురేందర్‌కుమార్, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికి ఉభయ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

ఎర్రవల్లి ప్రజల కల సాకారం..

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలం కావాలని ప్రజలు కోరుకోగా.. ఆ ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చిందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శనివారం ఇటిక్యాల మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో మండల సాధన సమితి ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదట ఎర్రవల్లి కూడలిలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ ర్యాలీ, చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఏర్పాటు చేసిన అభినందన సభలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రైతుల అభివృద్ధి కోసం రైతు బంధు, రైతు భీమా, రుణమాఫీ, కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరలను కల్పించిందన్నారు. ప్రతి పల్లెకు బీటీ రోడ్లు, గ్రామాల్లో సీసీ రోడ్లను ఏర్పాటు చేసిందన్నారు. బీఆర్‌ఎస్ కుటుంబంలో ఉన్న ఇంటి దొంగలే అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న వారికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. ఈ సందర్భంగా 25 గ్రామ పంచాయతీల ప్రజా ప్రతినిధులు వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా అబ్రహంకు పూర్తి మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మాణం చేసి ఎమ్మెల్యేకు ఘజమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మహేశ్వరెడ్డి, నాయకులు డాక్టర్ అజయ్, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కృష్ణసాగర్, నీలి శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, గిడ్డారెడ్డి, రాఘున్న, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.



ఎర్రవల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కేటీదొడ్డి: సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని.. పక్క రాష్ట్రాల నుంచి మద్యం, గుట్కా, ఇతరత్రవి తరలించకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఏఎస్పీ రవి అన్నారు. శనివారం మండలంలోని నందిన్నె చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీ చేశారు. పోలీసులు, రెవెన్యూ, అబ్కారీ శాఖల సమన్వయంతో విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



నందిన్నె చెక్‌పోస్టు తనిఖీ చేసిన ఏఎస్పీ రవి

క్లుప్తంగా

లైంగిక వేధింపులతో బాలిక బలవన్మరణం

ఊర్కొండ: లైంగిక వేధింపులు తాళలేక ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ లెనిన్ కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను వరుసకు సోదరుడు అయ్యే పోలె కొండలు అనే యువకుడు కొన్నాళ్లుగా వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయమై గతంలో కేసు నమోదు చేయగా.. సదరుడు యువకుడు జైలుకు వెళ్లివచ్చినా తనతీరు మార్చుకోలేదు. మళ్లీ అలాగే వేధించడంతో బాలిక గత నెల 22న పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి.. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందింది. ఈ విషయమై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రి మందలించాడని బాలిక..

బిజినేపల్లి: తండ్రి మందలించడంతో ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా.. మండలంలోని ఖానాపూర్‌కు చెందిన బాలస్వామి కూతురు కల్పన(16) చెప్పిన మాట సరిగా వినడం లేదని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలోనే మృతిచెందింది. ఈ ఘటనపై బాలిక తండ్రి బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాములు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


వెంకటస్వామి (ఫైల్)

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో విద్యుదాఘాతానికి గురై కూరగాయల వెంకటస్వామి(40) అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తన ఇంటి వద్ద శనివారం ఉదయం నీటి సంపు మోటార్ స్విచ్ ఆన్ చేసి తెగిపడిన విద్యుత్ వైర్లను సరిచేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య లక్ష్మి, కుమారులు కృష్ణ, అంజి ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజు తెలియజేశారు.

నీటి గుంతలో పడి బాలుడు..


ప్రణీత్(ఫైల్)

మన్ననూర్: వ్యవసాయ పొలంలో చేపల పెంపకానికి ఏర్పాటు చేసిన నీటి గుంత(ఫాం పాండ్)లో పడి కేతావత్ ప్రణీత్(6) మృతిచెందిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగాపూర్‌కి చెందిన కేతావత్ రవి, విజయ దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్దకుమారుడు ప్రణీత్‌ను మన్ననూర్‌లోని ఉమామహేశ్వర కాలనీలోని అమ్మమ్మ ఇంట్లో ఉంచి బతుకుదెరువు నిమిత్త హైదరాబాద్‌కు వలస వెళ్లారు. నాలుగేళ్లుగా ప్రణీత్ అక్కడే ఉంటూ స్థానిక మార్గదర్శి విద్యాలయంలో ఒకటో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం బడికి వెళ్లకుండా కొందరితో కలిసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో చేపలను చూసేందుకు నీటి గుంతలోకి తొంగి చూస్తూ.. ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయాడు. సమీప వ్యవసాయ పొలంలోని వ్యక్తులు గమనించి నీటిలోంచి బయటకు తీసేలోపే మృతిచెందాడు. మృతదేహాన్ని సొంత గ్రామమైన రంగాపూర్‌కు తరలించి అంత్యక్రియలు చేశారు. బీజేపీ అచ్చంపేట ఇన్‌చార్జ్ శ్రీకాంత్ బీజేపీ నాయకులతో కలిసి బాలుడి మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

చెరువులో పడి వ్యక్తి..

భూత్పూర్: మండలంలోని కప్పెటలో శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కప్పెటకు చెందిన జాఫర్(30) గ్రామ సమీపంలోని చెరువు వద్ద బహిర్భూమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు గ్రామ సమీపంలోని చెరువులో పడిపోయాడు. జాఫర్ పడిపోయిన విషయం గమనించిన గ్రామస్తులు వెంటనే చెరువు వద్దకు చేరుకుని చెరువులోంచి బయటకు తీశారు. అప్పటికే అతను మృతిచెందాడు. జాఫర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చనిపోయిన విషయం తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

నలుగురిపై కేసు నమోదు

పెబ్బేరు రూరల్: వనపర్తి సమీపంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం పోలీసులు దాడి చేసి నలుగురిపై కేసు నమోదు చేశామని సీఐ మహేశ్వరరావు తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలానికి చెందిన పుల్లయ్య, ఏపీలోని అనంతపురం జిల్లా రాయదుర్గం మహేష్ కలిసి పెబ్బేరు శివారులోని ఓ ప్రాంతంలో వ్యభిచారం నడుపుతున్నారు. ఈ విషయమై అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇద్దరు నిర్వాహకులు, ఇద్దరు విటులను పట్టుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. అలాగే ఓ మహిళను సఖీ కేంద్రంకు పంపించామని సీఐ చెప్పారు.

జడ్చర్లలో గంజాయి పట్టివేత

- లారీలో తరలిస్తుండగా నార్కోటిక్స్ అధికారుల చేజింగ్
- 207 కిలోల గంజాయి, లారీ, కారు స్వాధీనం, నలుగురు నిందితుల అరెస్ట్
- పట్టుబడిన సరుకు విలువ రూ.40 లక్షలపైనే..


జడ్చర్ల వద్ద పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న సీఐలు


బస్తాలలో పట్టుబడిన గంజాయి

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలో శనివారం భారీస్థాయిలో గంజాయి పట్టుబడింది. ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని రాష్ట్ర నార్కోటిక్స్ అధికారుల బృందం పక్కా ప్రణాళికతో పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. జడ్చర్ల నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే 167 నంబర్ జాతీయ రహదారిపై నక్కలబండతండా వద్ద లారీని, దానిని అనుసరిస్తున్న ఓ కారును రాష్ట్ర నార్కోటిక్స్ ఎస్పీ సునీతరెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం ఆపి తనిఖీ చేశారు. లారీలో చిన్న చిన్న ప్యాకింగ్ కవర్లలో తరలిస్తున్న గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయిని తూకం వేయగా 207 కిలోలు ఉందని, దీని విలువ సుమారు రూ.40 లక్షలపైనే ఉంటుందని భావిస్తున్నారు.

పక్కా సమాచారంతో..

గుట్టుగా లారీలో గంజాయి తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో రాష్ట్ర నార్కోటిక్స్ ఎస్పీ సునీత రెడ్డి తమ బృందంతో లారీ (ఎంహెచ్ 41 ఏయూ 5287)ని అనుసరించారు. అలాగే లారీ వెనక అనుసరిస్తున్న కియా కారు(ఎంహెచ్ 25ఏడబ్ల్యూ 6615)ను సైతం గుర్తించారు. జడ్చర్ల- మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై నక్కలబండతండా సమీపంలోకి రాగానే నార్కోటిక్స్ అధికారులు లారీని, కారును సైతం ఆపి తనిఖీలు చేయగా గంజాయి పట్టుబడింది. వెంటనే లారీ, కారు డ్రైవర్లతోపాటు మరో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం నుంచి కర్ణాటకకు తరలిస్తున్నట్లు సమాచారం.

లోతుగా విచారిస్తాం..

గంజాయి పట్టివేతకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించేందుకు నార్కోటిక్స్ ఎస్పీ సునీతరెడ్డి నిరాకరించారు. వివరాలు వెల్లడయితే కేసు దర్యాప్తు ముందుకు సాగే పరిస్థితి ఉండదన్నారు. పట్టుబడిన గంజాయి సంఘటన ఆధారంగా మరింత లోతుగా కేసును విచారిస్తామని, మీడియా తమకు సహకరించాలని కోరారు. మొదటగా ఫొటోలు తీసుకునేందుకు కూడా అనుమతించని ఎస్పీ తర్వాత ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు అంగీకరించారు. జడ్చర్ల సీఐలు రమేశ్‌బాబు, జములప్ప, ఎస్ఐ చంద్రమోహన్ ఘటనా స్థలానికి చేరుకునిఅధికారులకు సహకరించారు.

కలకలం రేపిన ఘటన

జడ్చర్ల ప్రాంతంలో ఒక్కసారిగా పెద్దఎత్తున గంజాయి పట్టుబడడం కలకలం రేపింది. ఇప్పటి వరకు ఇంత భారీగా గంజాయి ఎప్పుడూ పట్టుబడలేదు. ఓ వైపు 44వ నంబర్ జాతీయరహదారితోపాటు మరోవైపు 167వ నంబర్ జాతీయ రహదారి కలిగి ఉండడంతో జడ్చర్ల మీదుగా వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున స్మగ్లింగ్ కొనసాగుతుందని పోలీసులతోపాటు ఎక్సైజ్, నార్కోటిక్స్ తదితర అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే శనివారం గుట్టుగా తరలుతున్న గంజాయి పట్టుబడినట్లు తెల్సింది.

ఏడుగురికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని ఏడుగురికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని ఎదిర జెడ్పీహెచ్ఎస్‌లో జీహెచ్ఎంగా పనిచేస్తున్న జి.హేమచంద్రుడు, చిన్నచింతకుంట మండలంలోని గూడూరు ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న వై.నాగరాజు, వనపర్తి జిల్లాలోని ఖిల్లాఘనపురం బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో మ్యాథ్స్ ఎస్ఏగా పనిచేస్తున్న ఎం.శోభారాణి, కొత్తకోటలోని బాలికల జెడ్పీహెచ్ఎస్‌లో సోషల్ ఎస్ఏగా పనిచేస్తున్న మునీంద్రమ్మ, రామకృష్ణాపూర్‌లోని యూపీఎస్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న పి.మురళీకృష్ణ, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉప్పునుంతల జెడ్పీహెచ్ఎస్‌లో మ్యాథ్స్ ఎస్ఏగా పనిచేస్తున్న కె.లక్ష్మారావు, అచ్చంపేటలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్ఏగా పనిచేస్తున్న కె.శ్రీనివాసులు ఉన్నారు. వీరికి ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు అందజేయనున్నారు.

సంతోషంగా ఉంది..



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక వడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు మూసాపేటకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ముగ్గురు బాలికలను పదేళ్లుగా దత్తత తీసుకుని చదివిస్తున్నా. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఖిల్లాఘనపురం పాఠశాలలో సొంత డబ్బులు రూ.1.20 లక్షలతో గణితంపై విద్యార్థులు పట్టుసాధించేందుకు ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేసి మంత్రి నిరంజన్‌రెడ్డిచే ప్రారంభించాం. నేను పనిచేసిన పాఠశాలల్లో గత పదేళ్లలో పదో తరగతి మ్యాథ్స్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. పాఠశాలల అభివృద్ధి కోసం సమాజంలోని ప్రతిఒక్కరిని భాగస్వామ్యం చేస్తున్నా.

– శోభారాణి, ఎస్ఏ మ్యాథ్స్, జెడ్పీహెచ్ఎస్ (బాలిక), ఖిల్లాఘనపురం

సమగ్ర అభివృద్ధికి కృషి



విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాం. మేం సాధించలేని కథలన్నీ విద్యార్థుల ద్వారా చెప్పేలా పాటుపడుతున్నాం. మా సేవలను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి రాష్ట్రస్థాయిలో అవార్డు ఇవ్వడం మరింత బాధ్యతను పెంచింది. భవిష్యత్‌లోనూ విద్యార్థుల అభివృద్ధికి మరింత కృషి చేస్తాం.

– జి.హేమచంద్రుడు, జీహెచ్ఎం, ఎదిర జెడ్పీహెచ్ఎస్, మహబూబ్‌నగర్ జిల్లా

బాధ్యత పెంచింది..



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికవడం గర్వంగా ఉంది. ఈ అవార్డు నాపై మరింత బాధ్యత పెంచింది. విద్యార్థులకు సులభ పద్ధతితో గణితంపై పట్టుసాధించేలా బోధన చేస్తున్నా. నా 34 ఏళ్ల సర్వీసులో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండటం చాలా ఆనందంగా ఉంది. నా సేవలను విద్యాశాఖ గుర్తించి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం సంతోషం.

– లక్ష్మారావు, మ్యాథ్స్ ఎస్ఏ, జెడ్పీహెచ్ఎస్, ఉప్పునుంతల

గణితంపై మక్కువ..



అచ్చంపేట మండలం చెన్నారం ప్రాథమికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను. ఇక్కడికి వచ్చినప్పుడు పిల్లలు గణితంలో చాలా వెనకబడి ఉండటంతో బోర్డు మీద చేస్తేనే సరిపోదని భావించి.. చిన్న చిన్న టీఎల్ఎం ద్వారా వాళ్లకు అర్థమయ్యేలా పాఠాలు చెప్పాను. 1998లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా అమ్రాబాద్ మండలం చిట్లంకుంటలో విధుల్లో చేరాను. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు గణితం పట్ల మక్కువ కలిగేలా సులభ పద్ధతిలో బోధన చేస్తున్నాను. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికవడం చాలా సంతోషంగా ఉంది.

– శ్రీనివాసులు, ఎస్ఏ, చెన్నారం ప్రాథమికోన్నత పాఠశాల, అచ్చంపేట మండలం

తల్లిదండ్రులకు అంకితం



రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు రావడం సంతోషంగా ఉంది. ఈ అవార్డును నా తల్లిదండులకు అంకితం ఇస్తున్నా. బోధనలో వినూత్నమైన పద్ధతులు అవలంభించడానికి వెదురుతో చేసిన వివిధ రకాల ఆట వస్తువులు, బోధనోపకరణాలు, వెదురుతో అనుసంధానం కలిగిన వివిధ గ్రామీణ ఆటలతో నూతన విద్యా విధానం-2020 అనుగుణంగా విద్యార్థులకు ఆసక్తిరేకెత్తిస్తూ.. మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తున్నాను.

– మురళీకృష్ణ, జీహెచ్ఎం, ప్రాథమిక పాఠశాల, రామకృష్ణాపురం, కొత్తకోట

గోల్డెన్ పాఠశాలగా..



విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడా లేని విధంగా గూడూరు ప్రాథమిక పాఠశాలల్లో 2018 సంవత్సరంలో ఎక్స్‌పో కార్యక్రమం చేపట్టాం. ఈ కార్యక్రమం ద్వారా మార్కులు కాదు ముఖ్యం.. మార్పు ముఖ్యం అన్న నినాదంతో పనిచేశాం. ఫలితంగా సత్ఫలితాలు వచ్చి.. గోల్డెన్ పాఠశాలగా తీర్చిదిద్దాం. మారుమూల ప్రాంతంలోని పాఠశాలలో అందించిన సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉంది.

– నాగరాజు, ఎస్‌జీటీ, ఎంపీపీఎస్, గూడూరు, చిన్నచింతకుంట

విద్యతోపాటు విజ్ఞానం



విద్యార్థులకు చదువుతోపాటు విజ్ఞానం అందించి సమాజాభివృద్ధికి తోడ్పడేలా తీర్చిదిద్దడం ఎంతో ముఖ్యం. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగే వీలుంది. మా పాఠశాలలోని విద్యార్థినులు సాంఘికశాస్త్ర టాలెంట్ టెస్ట్‌లో జిల్లాస్థాయిలో బహుమతులు సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో 'కరోనా ఖతం- సైన్స్ సక్సెస్' అనే నాటకాన్ని ప్రదర్శించి మన్ననలు పొందాం. అలాగే విద్యార్థులచే మాక్ గ్రామసభ, మాక్ పోలింగ్ నిర్వహించాం.

– మునీంద్రమ్మ, జెడ్పీహెచ్ఎస్, బాలికల పాఠశాల, కొత్తకోట

ఆదిత్య ఎల్ 1లో కత్తేపల్లివాసి

- ఇస్రోలో 2019 నుంచి ఇంజినీర్‌గా విధులు
- చంద్రయాన్ 3, ఆదిత్య ఎల్ 1 విజయంలో భాగస్వామ్యం
- కత్తేపల్లి వాసుల హర్షం


ఆదిత్య ఎల్ 1 రాకెట్ వద్ద అఫ్రోజ్

ఆత్మకూర్: ఆదిత్య ఎల్ 1, చంద్రయాన్ 3 విజయంలో ఆత్మకూర్ మండలం కత్తేపల్లికి చెందిన మహమ్మద్ అఫ్రోజ్ భాగస్వామ్యం ఉండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కత్తేపల్లికి చెందిన ఎండీ తురాబ్‌అలీ, రెహానబేగం పెద్దకుమారుడు మహ్మద్ అఫ్రోజ్ గద్వాలలో పదో తరగతి వరకు చదువుకున్నాడు. డిప్లమా ఇన్‌పెట్రోకెమికల్స్ జీపీసీఈ విశాఖపట్నంలో, బీటెక్ సీబీఐటీ హైదరాబాద్‌లో, ఎంటెక్ ఉస్మానియాలో విద్యాభ్యాసం పూర్తిచేసుకున్నాడు. వెంటనే అవీవా ప్రైవేటు కంపెనీలో మూడేళ్ల పాటు ఉద్యోగం చేశారు. 2019లో నెల్లూర్‌లోని శ్రీహరికోటలో ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆదిత్య ఎల్ 1 సాలిడ్ రాకెట్‌ను తీసుకెళ్లే మోటార్స్, బూస్టర్స్ డివిజన్ ఎస్ 200(సిస్టం రియాలిబిలిటీ) క్వాలిటీ ఇంజినీరుగా విధులు నిర్వహించాడు. ఈ డివిజన్‌లో మొత్తం ఏడుగురు ఉండగా.. అందులో అఫ్రోజ్ ఒకరు. ఆరు నెలల పాటు శ్రమించి విధులను విజయవంతంగా చేపట్టారు. శనివారం ఆదిత్య ఎల్ 1 రాకెట్ లాంచింగ్ విజయవంతం అవ్వడంతో తమ కష్టానికి ప్రతిఫలం లభించిందని అన్నారు. జూలై 14న చంద్రయాన్ 3 విజయవంతంగా ప్రయాణం మొదలుపెట్టి ఆగస్టు 23న చంద్రుడిపై ల్యాండ్ అయిన సందర్భంగా తనతో పాటు సహచరుల భాగస్వామ్యం గురించి 'సాక్షి'తో తన అనుభూతులను పంచుకున్నాడు.

గర్వంగా ఉంది..

ఇదివరకు చంద్రుడిపై చంద్రయాన్ 3 విజయవంతంగా ల్యాండ్ అవ్వడంతో గర్వంగా ఉప్పొంగిపోయాం. అలాగే శనివారం ఆదిత్య ఎల్ 1 విజయవంతంగా లాంచింగ్ అవ్వడం సంతోషకరమైన విషయం. ఈ మిషన్‌లో సాలిడ్ రాకెట్ మోటార్స్ బూస్టర్ డివిజన్ విభాగంలో ఏడుగురి బృందం శ్రమించింది. సైంటిస్టుల శ్రమ ఫలించి సూర్యుడి కక్ష్యలో ఆదిత్య ఎల్ 1, చంద్రుడిపై చంద్రయాన్ 3 శాస్త్రవేత్తల జ్ఞానం, భారతదేశ గౌరవాన్ని మోసుకెళ్లింది. గొప్ప ఫలితాలు వస్తాయని కోరుకుంటున్నాను.

– మహమ్మద్ అఫ్రోజ్, క్వాలిటీ ఇంజినీర్, శ్రీహరికోట

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పేలిన పీటీ

ఎగసిపడిన మంటలు.. నిలిచిన సరఫరా


సబ్‌స్టేషన్‌లో కాలిపోతున్న పీటీ

అమరచింత: పట్టణంలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం కొత్తగా అమర్చిన పీటీ పేలిపోవడంతో మంటలు ఎగసిపడి.. సరఫరా నిలిచిపోయింది. మంటలు ఆర్పేందుకు ఫైర్ అధికారులు గంటపాటు శ్రమించి అదుపులోకి తెచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏర్పాటు చేసిన పీటీ పేలిపోవడంతో పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో 6 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాలో జరిగే అంతరాయాలను నివారించడానికి వీలుగా 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మూడు పీటీలను ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి మరమ్మతు కారణంగా వారం రోజుల కిందట తొలగించారు. శనివారం కొత్త పీటీని తీసుకొచ్చి అమర్చేందుకు ప్రయత్నించారు. పీటీని అమర్చిన ఐదు నిమిషాలలోపే పేలిపోయింది. సబ్‌స్టేషన్ సమీపంలో ట్రాన్స్‌కో సిబ్బంది లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది. ఆరుగంటల పాటు శ్రమించిన ట్రాన్స్‌కో అధికారులు ఎట్టకేలకు విద్యుత్ సరఫరాలను పునరుద్ధరించారు.

రోడ్డెక్కిన రైతులు

- 167వ నంబరు జాతీయ రహదారిపై గంగాపురం సమీపంలో రాస్తారోకో
- వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ సమస్యతో ఎండుతున్న పంటలు


167వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

జడ్చర్ల టౌన్: అసలే వర్షాభావ పరిస్థితులు ఆపై కరెంట్ సమస్యతో పంటలు ఎండిపోతుండటంతో ఆగ్రహించిన మండలంలోని గంగాపురం, పరిసర పొలాల రైతులు శనివారం ఉదయం 167వ నంబరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. 20 రోజులుగా ఎల్లమ్మ దేవాలయం సమీపంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పాఠశాలలు, విధులకు వెళ్లే వారంతా ఇబ్బందులకు గురయ్యారు. గ్రామంలో 33 కేవీ సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ 3 ఫేస్ కరెంట్ సరఫరా కావటం లేదని అడపా దడపా 3 ఫేస్ రావటంతో పంటలకు నీళ్లు పారపెట్టుకోలేకపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. నెల రోజుల కిందట కరెంట్ సమస్యపై రాస్తారోకో నిర్వహించగా.. పది రోజులు విద్యుత్ సరిగా వదిలారని, ఆ తర్వాత సమస్య మొదటికొచ్చిందని రైతులు వాపోయారు. రికార్డులో 18 గంటలు 3 ఫేస్ కరెంట్ సప్లయ్ చేసినట్లుగా చెబుతున్నప్పటికీ వాస్తవంగా రావటం లేదని ఆరోపిస్తున్నారు. వర్షాలు పడకపోవటంతో పంటలు ఎండిపోతున్నాయని, ఉన్న నీళ్లను వాడుకునేందుకు కరెంట్ సరఫరా లేదని, పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదని నిరసనకు దిగినట్లు చెప్పారు. విడతల వారీగా 3 ఫేస్ రావటంతో ఎలాంటి లాభం లేదని వాపోయారు. తమకు ఆటంకాలు లేకుండా 8 గంటలు సరఫరా ఇస్తే చాలని నినదించారు.

సీఐతో వాగ్వాదం..

రాస్తారోకో విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ముందస్తు సమాచారం లేకుండా రాస్తారోకో నిర్వహించటం సరి కాదని ఆయన రైతులకు నచ్చజెప్పారు. ఈ సందర్భంగా రైతులు సీఐతో వాగ్వాదానికి దిగారు. కొద్దిరోజుల కిందట ధర్నా చేస్తే ఆ సమయంలోనే సమస్య పరిష్కరింపజేస్తామని చెప్పారని, సమస్య అలాగే ఉందని ఆయనకు తెలియజేశారు. రాస్తారోకో స్థలం నుంచే సీఐ ఏఈ కిరణ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వటంతో పాటు లైన్‌మెన్ శ్రీనివాస్‌ను పంపించి రైతులకు నచ్చజెప్పించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

అసలు సమస్య ఇది

గంగాపురం 33కేవీ సబ్‌స్టేషన్‌కు పోలేపల్లి 132కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ సబ్‌స్టేషన్‌పై ఓవర్‌లోడ్ కావటంతో సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. దాంతో పాటు షాద్‌నగర్‌లో పవర్ ట్రాన్స్‌మీటర్ కాలిపోవటంతో బాలానగర్, రాజాపూర్‌తో పాటు ఇతర సబ్‌స్టేషన్లకు విడతల వారీగా పోలేపల్లి నుంచి సరఫరా ఇస్తున్నారు. దీంతో గంగాపురం సబ్‌స్టేషన్‌కు 3ఫేస్ కరెంట్ సరఫరా సక్రమంగా ఇవ్వలేకపోతున్నారు. విడతల వారీగా సరఫరా ఇస్తుండటంతో రైతులకు ప్రయోజనం లేకుండా పోతుంది. అలాగే ఓవర్‌లోడ్‌తో ఫీడర్లు మార్చటానికి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ కారణంగా 3 ఫేస్ సరఫరా సక్రమంగా ఇవ్వలేకపోతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి..



20 ఎకరాల పొలంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు వేశాను. వర్షాలు పడకపోవటంతో పంటలు ఎండిపోతున్నాయి. బోర్లలో ఉన్న నీళ్లు వాడుకుందామంటే కరెంట్ సరఫరా సక్రమంగా లేదు. అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవటం లేదు. అందుకే ధర్నాకు దిగాల్సి వచ్చింది. 20 రోజులుగా సమస్య చాలా ఉంది. కనీసం 8 గంటల పాటినా 3ఫేస్ కరెంట్ ఇస్తే బాగుంటుంది.

– రాములు, గంగాపురం, రైతు

మొదటికొచ్చింది..



గతంలో ధర్నా చేస్తే వారం రోజులు ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా చేశారు. నెల రోజుల కిందట ఇలాగే రోడ్డుపైకి ఎక్కి ధర్నా చేస్తే అపుడు వారం రోజుల పాటు కరెంట్ సరఫరా బాగా వచ్చింది. 20 రోజులుగా సమస్య మొదటికి వచ్చింది. ఓ వైపు వానలు రావటంలేదు. ఇంకోవైపు కరెంట్ సరిగ్గా రావటం లేదు. అడిగితే ఓవర్ లోడ్ అని చెబుతున్నారు. కనీసం 8 గంటలు సరఫరా ఇస్తే బాగుంటుంది.

– మల్లయ్య గౌడ్, గంగాపురం రైతు

పరిష్కారానికి చర్యలు

గంగాపురం సబ్‌స్టేషన్‌కు సరఫరాలో వచ్చే సమస్యలను పరిష్కరింపజేస్తామని ఏఈ కిరణ్ తెలియజేశారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించామని ఆదివారం నుంచి ఆటంకం లేకుండా చూస్తామన్నారు. రైతులు కోరినట్లుగా నిరాటంకంగా సరఫరా ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. షాద్‌నగర్‌లో పవర్ ట్రాన్స్‌మీటర్ కాలిపోవటంతో పోలేపల్లి 132కేవీ సబ్‌స్టేషన్‌పై ఓవర్‌లోడ్ పడిందని, అందుకే విడతల వారీగా సరఫరా వస్తుందన్నారు. అలా కాకుండా చూస్తామని 'సాక్షి'కి తెలియజేశారు.

మధ్యవర్తిత్వమే ఉత్తమ మార్గం

▶ మొదటి పేజీ తరువాయి

మహనీయులు ప్రవచించిన జీవన విధానం మంచిదని సూచించారు. శనివారం హైదరాబాద్ షామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో 20వ స్నాతకోత్సవం జరిగింది. ఇందులో సుప్రీం కోర్టు న్యాయమూర్తి, జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ (నల్సా) కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్ ముఖ్య అతిథిగా, సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, వర్సిటీ చాన్సలర్ అలోక్ అరాధే అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ సంజయ్‌కిషన్ కౌల్ మాట్లాడుతూ.. ''మనుషులం కనుకే ఆలోచిస్తాం.. ఒకరికొకరు భిన్నంగా ఆలోచిస్తాం. తర్క, వితర్కాలతో సంభాషించుకుంటూనే శాంతియుతంగా జీవించే సమాజం ఉండాలి. మన రాజ్యాంగ నైతికత కూడా దీన్నే తెలియజేస్తుంది. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించే విధానంలో అందరి తర్కం, వాదన విని.. అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం లభిస్తుంది. నాలుగు మెదళ్ల సంఘర్షణ నుంచి వచ్చే పరిష్కారం మెరుగ్గానే ఉంటుందనడంలో ఆశ్చర్యం అవసరం లేదు..'' అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు న్యాయం అందేలా కృషి చేయాలని న్యాయ విద్యార్థులకు పిలుపునిచ్చారు.

సీఎం కేసీఆర్ సహకారం మరువలేనిది..

నల్సార్ వర్సిటీలో వసతులు కల్పించడంలో సీఎం కేసీఆర్ సహకారం మరువలేనిదని వర్సిటీ వీసీ శ్రీకృష్ణదేవరావు పేర్కొన్నారు. జ్యుడిషియల్ అకాడమీ కోసం 25 ఎకరాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. 25ఏళ్ల నల్సార్ వర్సిటీ ప్రస్థానంలో ఎన్నో కొత్త కోర్సులను తీసుకొచ్చామని, ఎందరో విద్యార్థులను సమాజానికి అందించామని చెప్పారు. లీగల్ ఎయిడ్‌తోపాటు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను ప్రోత్సహించడంలో నల్సార్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌డీ, ఎల్ఎల్ఎం, ఎంబీఏ, బీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలతో పాటు 58 మందికి బంగారు పతకాలను అందజేశారు. ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డితోపాటు ఇతరులు రాసిన పుస్తకాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు సీజే ఆవిష్కరించారు. హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముడుపులివ్వకపోతే మూడినట్లే!

▶ మొదటి పేజీ తరువాయి

ఎలా చేరాయన్న విషయాన్ని ఐటీ శాఖ స్పష్టంగా ఓ పట్టిక రూపంలో వివరించింది. ఇంత స్పష్టమైన ఆధారాలున్నాయి కనక దీన్ని చంద్రబాబు సంపాదించిన అక్రమ ఆదాయంగా ఎందుకు పరిగణించకూడదో చెప్పాలని నోటీసుల్లో పేర్కొంది.

మనోజ్ పార్థసాని ఏం చెప్పారంటే...

మనోజ్ పార్థసాని కార్యాలయంలో సోదాల అనంతరం ఆయన్ను ఐటీ శాఖ కొన్ని ప్రశ్నలడిగింది. దానికి ఆయనిచ్చిన సమాధానాలను రికార్డు చేసింది. ఆ ప్రశ్న జవాబులు ఎలా సాగాయంటే...

ఐటీ శాఖ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మీరు తరచూ కలిసేవారా? ఎక్కడ? ఏం మాట్లాడుకునేవారు?


ఎంపీపీ: రాజధాని తాత్కాలిక భవనాల నిర్మాణ పనులు షాపూర్జీ పల్లోంజీ సంస్థకు దక్కాయి. ఆ సమయంలో అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడిని పలు సమావేశాలు, ప్రజెంటేషన్ల సమయంలో కలిశాను. ఏపీ టిడ్కో ఇళ్ల నిర్మాణం (2017లో షాపూర్జీ పల్లోంజీ 1.40 లక్షల ఇళ్లను నిర్మించే కాంట్రాక్టును దక్కించుకుంటే 2019 మార్చి నాటికి కేవలం 23వేల ఇళ్ల నిర్మాణాన్నే పూర్తి చేసింది) ఈడబ్ల్యూఎస్ హౌసింగ్, హైకోర్టు నిర్మాణం, అమరావతి రాజధాని ప్రాంతంలో ఇతర విభాగాధిపతులు కార్యాలయాల నిర్మాణల సమయంలో చంద్రబాబును పలు సందర్భాల్లో కలిశా. ఇవి పూర్తిగా ప్రభుత్వం నిర్వహించిన సమావేశాలు. ఏపీటిడ్కో, ఏపీ సీఆర్‌డీఏ వాళ్లు నిర్వహించే ఈ సమావేశాలకు షాపూర్జీ పల్లోంజీ ప్రతినిధులతో కలిసి నేను హాజరయ్యాను.చంద్రబాబు నాయుడిని తొలిసారిగా వ్యక్తిగతంగా కలిసినప్పుడు... ఆయన 2019, ఫిబ్రవరిలో విజయవాడలోని తన ఇంటికి వచ్చి కలవాలని చెప్పారు. ఆయన చెప్పిన ప్రకారం ఆయన ఇంటికి వెళ్లా. అక్కడకు వెళ్లి కలిసినపుడు రాజధానిలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనుల స్థితి గతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు తన వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్‌ను నాకు పరిచయం చేశారు. ఆయన చెప్పినట్టుగా నడుచుకోవాలని ఆదేశించారు.

ఐటీ శాఖ: చంద్రబాబు నాయుడు తరఫున శ్రీనివాస్ మీకు ఎలాంటి సూచనలిచ్చారు?

ఎంపీపీ: శ్రీనివాస్ నాకు కొన్ని కంపెనీల జాబితాను పంపిస్తానని చెప్పాడు. ఆ కంపెనీల ద్వారా ముడుపులు తరలించాలని చెప్పారు. శ్రీనివాస్ ఆదేశాల మేరకు సబ్ కాంట్రాక్టు పనులు పొందిన విక్కీజైన్ అనే వ్యక్తి టచ్‌లోకి వచ్చారు. విక్కీ జైన్ నయోలిన్, ఎవరెట్ అనే కంపెనీల పేర్లను ఇచ్చారు. శ్రీనివాస్ ఆదేశాల మేరకు మార్చి, 2019లో నన్ను విజయ్ నంగాలియా అనే వ్యక్తి కలిశారు. ముంబై కొలాబాలో ఉన్న షాపూర్జీ పల్లోంజీ ఆఫీసు బయట ఆయన నన్ను కలిశారు. నంగాలియా, హయగ్రీవ, అన్నై, షలాక కంపెనీలకు సబ్ కాంట్రాక్టు రూపంలో వర్క్ ఆర్డర్ల పేరిట ముడుపుల నగదు తరలించాల్సిందిగా సూచించారు. ఇలా తరలించిన నగదును విక్కి, వినయ్ నంగాలియాలు చంద్రబాబు నాయుడు ఎక్కడకు చేరవేయమంటే అక్కడకు చేరవేసేవారు. ఈ కంపెనీల్లోకి ఇంకా బోలెడంత నగదు వచ్చింది. అది ఎక్కడి నుంచి వచ్చింది? దాన్ని ఎక్కడకు తరలించారన్న సంగతులు నాకు తెలియవు. ఎందుకంటే కేవలం షాపూర్జీ పల్లోంజీ కంపెనీ నుంచి జరిగిన చెల్లింపుల వరకే నాకు తెలుసు. ఆ విషయం నాకు తెలుసు కనక దాన్ని శ్రీనివాస్‌కు చెప్పి... ఆ మొత్తం చంద్రబాబుకు చేరిందా లేదా అన్న విషయాన్ని కనుక్కునేవాడిని.

ఐటీ శాఖ: చంద్రబాబు నాయుడు, శ్రీనివాస్ చెప్పినంత మాత్రాన బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా నగదు తరలించడం తప్పు కదా? దాన్ని మీరు ఎందుకు వ్యతిరేకించలేదు?

ఎంపీపీ: శ్రీనివాస్ ఈ కంపెనీల ద్వారా బోగస్ బిల్లులతో నగదు తరలించాలని చేసిన ప్రతిపాదనను మొదట్లో నేను వ్యతిరేకించాను. షాపూర్జీ పల్లోంజి అనేది అతిపెద్ద కార్పొరేట్ సంస్థ అని, అవసరమైతే వాళ్లు అడిగిన మొత్తాన్ని నేరుగా పార్టీ ఫండ్ రూపంలోనే చెల్లిస్తుందని చెప్పాను. అప్పుడు వాళ్లు చాలా స్పష్టంగా చెప్పారు... ''ఇది పార్టీ ఫండ్ కాదు. ఈ కంపెనీల ద్వారా మేం చెప్పిన వ్యక్తులకు నేరుగా నగదును తరలించాల్సిందే. ఒకవేళ మీరు గనక మా ఆదేశాలు పాటించకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది'' అని. నిజానికి అప్పటికే మేం రాజధానిలో చాలా ప్రాజెక్టుల్లో ఇరుక్కుపోయి ఉన్నాం. నడుస్తున్న అనేక ప్రాజెక్టులతో భారీగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వాళ్లు చెప్పినట్లుగా వినటం తప్ప మాకు వేరే దారి కనిపించలేదు.



టీవీ5 చానల్‌ను బ్యాన్ చేయాలి

- మహిళలను నీచంగా మాట్లాడి క్షమాపణ చెప్పరా?
- ఇదేంటని నిలదీసినందుకు నన్ను చంపుతానంటారా?
- పోసాని కృష్ణమురళి ఆగ్రహం



సాక్షి, అమరావతి: జర్నలిజం విలువలు దిగజార్చేలా సమాజంలోని మహిళలను అసభ్య పదజాలంతో కించపరుస్తున్న టీవీ5 చానల్‌ను వెంటనే నిషేధించాలని ఏపీ చలనచిత్ర, టీవీ నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి కోరారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీవీ5 చైర్మన్ బీఆర్ నాయుడు ప్రోద్బలంతో న్యూస్ రీడర్ సాంబశివరావు సినిమా ఇండస్ట్రీలోని మహిళలపై నీచమైన వ్యాఖ్యలతో అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దిగజారుడు జర్నలిజాన్ని ఖండించినందుకు తనను చంపుతానని సాంబశివరావు బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు బూతులతో సమాజాన్ని ప్రశ్నించే హక్కును ఏ రాజ్యాంగం, ఏ న్యాయస్థానం ఇచ్చిందని నిలదీశారు. ప్రజా ప్రయోజనకర వార్తలను ప్రసారం చేస్తే రేటింగ్ పెరుగుతుంది తప్ప.. నీచమైన భాషను సమాజం హర్షించదన్నారు.

ఆడపడుచులకు టీవీ5 క్షమాపణ చెప్పేంత వరకు పోరాటం చేస్తూనే ఉంటానన్నారు. 'బీఆర్ నాయుడు పెద్ద దొంగ. టీవీ5 చానల్ పెట్టేముందు ఓ వ్యక్తి దగ్గరకు వెళ్లి సాయం అడిగారు. ఆయన రూ.30 కోట్లు ఇచ్చి చానల్ పెట్టుకోమన్నారు. కొన్నేళ్ల తర్వాత సదరు వ్యక్తి డబ్బులు తిరిగి అడిగినందుకు అంతు చూస్తామంటూ బెదిరించాడు. మరో వడ్డీ వ్యాపారి దగ్గర రూ.12 కోట్లు తీసుకుని.. డబ్బులు అడిగితే.. తుపాకీతో చంపుతానని భయపెట్టారు. సాంబశివరావుతో క్షమాపణ చెప్పించి చానల్ నుంచి బయటకు పంపించడం బీఆర్ నాయుడికి ఇష్టంలేదు. మహిళలను తిట్టేవాళ్లంటే నాయుడికి ఎంతో ఇష్టం. తన వెనుక బూతులు తిట్టే లోకేశ్, చంద్రబాబు ఉన్నారనే ధైర్యంతో రెచ్చిపోతూ ఇంకా తిట్టమని ప్రోత్సహిస్తున్నారు. వీళ్లు ఉచ్చం నీచం లేని వ్యక్తులు' అంటూ పోసాని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతర్లీన శక్తిసామర్థ్యాలకు విద్యార్థులు పదునుపెట్టాలి

గవర్నర్ తమిళిసై

మంగళగిరి/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): విద్యార్థులు తమలో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తి సామర్థ్యాలకు నిత్యం పదును పెట్టాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ సూచించారు. అప్పుడే అన్ని రంగాల్లో పోటీని సమర్థంగా ఎదుర్కోగలరని చెప్పారు. మంగళగిరి మండలం నీరుకొండలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో శనివారం యూనివర్సిటీ 3వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తమిళిసై మాట్లాడుతూ ప్రతిరోజూ విద్యార్థులు కొత్త టెక్నిక్స్ నేర్చుకోవాలని, అవకాశాలను సృష్టించుకోవాలని చెప్పారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులు కొత్త లక్ష్యాలు, ఆశయాలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం శాస్త్ర సాంకేతిక రంగాల్లో విశేష సేవలు అందించిన డాక్టర్ అశుతోష్ శర్మకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. కాగా, ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను గవర్నర్ తమిళిసై దర్శించుకున్నారు.



విజయవాడ ఆలయంలో గవర్నర్ తమిళిసై

మెత్తబడని అసమ్మతి!

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పుడు సర్దుబాటుకు ససేమిరా అంటున్నారు. మరోవైపు అధికార పార్టీ ఎమ్మెల్యేలతో అంటకాగి పదవులు, పనులు పొందిన చోటా మోటా నేతలు కూడా ఏదో ఒక సాకు చూపుతూ ప్రస్తుతం దూరం పాటిస్తున్నారు. దీంతో ఎన్నికల ప్రచారంలోకి దిగాలనుకుంటున్న అభ్యర్థుల అడుగులు ముందుకు పడట్లేదు. ఆయా అభ్యర్థుల కుటుంబ సభ్యులు, ముఖ్య నేతలు అసమ్మతిని చల్లార్చేందుకు రాయబారం నెరపుతున్నా ఆశించిన ఫలితం రావట్లేదు. చాలా నియోజకవర్గాల్లో బుజ్జగింపుల పర్వం వికటించి కిందిస్థాయి నేతలు ఇతర పార్టీల వైపు చూస్తున్నారు. నియోజకవర్గాలవారీగా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బుజ్జగింపుల పర్వాన్ని పర్యవేక్షిస్తున్నారు. మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్, జగదీశ్‌రెడ్డి తదితరులు వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లా పార్టీ నేతలతో మంతనాలు జరుపుతూ దిద్దుబాటుకు ప్రయత్నిస్తున్నారు.

సొంతదారి వైపు అసమ్మతి చూపు

ఒకేసారి 115 మంది అభ్యర్థులను ప్రకటించడం బీఆర్ఎస్‌లో సంచలనం సృష్టించగా టికెట్ ఆశించి భంగపడిన నేతలు సొంత దారి చూసుకోవడంపై దృష్టిసారించారు. ఇప్పటికే ఎమ్మెల్యే రేఖానాయక్ (ఖానాపూర్), వేముల వీరేశం (నకిరేకల్) పార్టీని వీడగా మైనంపల్లి హన్మంతరావు (మల్కాజిగిరి), మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు (పాలేరు) తమ అనుచరులతో మంతనాలు జరుపుతున్నట్లు చెబుతున్నారు. తాము సైతం బీఆర్ఎస్‌ను వీడటం ఖాయమని ఇప్పటికే స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నారు. పటాన్‌చెరు, జహీరాబాద్, మెదక్, కల్వకుర్తి, సంగారెడ్డి, అలంపూర్, నాగార్జునసాగర్, కోదాడ, సూర్యాపేట, రామగుండం తదితర నియోజకవర్గాల్లో అసమ్మతి నేతలు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఇచ్చిన టికెట్లు రద్దు చేసి తమకు కేటాయించాలంటూ అధిష్టానానికి విజ్ఞప్తి చేస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో నెలకొన్న అసమ్మతి దిద్దుబాటుకు మంత్రి టి.హరీశ్‌రావు స్వయంగా రంగంలోకి దిగి అసమ్మతి నేతలతో తన నివాసంలో వరుస భేటీలు జరుపుతున్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటూ అభ్యర్థుల గెలుపు కోసం కలసికట్టుగా పనిచేయాలని కోరుతున్నారు. మెదక్, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలకు చెందిన అసమ్మతి నేతలు శుక్ర, శనివారాల్లో హరీశ్‌రావుతో భేటీ అయ్యారు. మరోవైపు అమెరికా పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఈ నెల 6న తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారని పార్టీవర్గాలు వెల్లడించాయి. కేటీఆర్ రాక తర్వాత బుజ్జగింపుల పర్వం వేగం పుంజుకోవడంతోపాటు క్షేత్రస్థాయిలో ప్రచారం కూడా పట్టాలెక్కుతుందని చెబుతున్నాయి.

జనగామ, నర్సాపూర్ పంచాయితీ యథాతథం

జనగామ, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రకటనపై నెలకొన్న సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి (జనగామ), చిలుముల మదన్‌రెడ్డి (నర్సాపూర్) తమకు టికెట్ దక్కుతుందనే ధీమాతో ఉన్నారు. మరోవైపు మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి (నర్సాపూర్), ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి (జనగామ) తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. కేటీఆర్ వచ్చిన తర్వాత ఈ రెండు నియోజకవర్గాలపై పీటముడి వీడే అవకాశముంది. జనగామలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి టికెట్ కోసం సర్వశక్తులూ ఒడ్డుతుండటంతో మధ్యేమార్గంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేరు తెరమీదకు వస్తున్నట్లు తెలిసింది.

పురుగు మందు తాగి యువ రైతు ఆత్మహత్య

శాంతినగర్: వర్షాలు సరిగా లేక పంటలు నష్టపోయి అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో ఓ యువ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శాంతినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏబూడిదపాడులో చోటుచేసుకుంది. శాంతినగర్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మానవపాడు మండలం ఏ బూడిదపాడుకు చెందిన రైతు ఉప్పరి రవికుమార్(30) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. తనకున్న పొలంతో పాటు మరికొంత పొలాన్ని ఈ ఏడాది కౌలుకు తీసుకుని మిరప, పత్తి పంటలు సాగుచేశాడు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు బాగా దెబ్బతిన్నాయి. దిగుబడి వచ్చే అవకాశం లేకుండా పోయింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ కుటుంబ సభ్యులతో బాధ పడుతూ ఉండేవాడు. శుక్రవారం రాత్రి 9 గంటల అనంతరం భోజనం చేశాక పశువులకు మేత వేసి వస్తానని చెప్పి కల్లందొడ్డికి వెళ్లాడు. గంట తర్వాత కూడా ఇంటికి రాకపోవడంతో అక్కడికి తండ్రి ఆంజనేయులు వెళ్లి చూశాడు. అప్పటికే కుమారుడు పురుగు మందు తాగి పడిపోయాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్‌లో తెలియజేశాడు. భార్య సంధ్య, కుటుంబ సభ్యులు వెంటనే 108లో చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున రవికుమార్ మృతిచెందాడు. ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వివరించారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక



ఈ ఏడాది నిర్వహించిన జిల్లాస్థాయి స్పోర్ట్స్ ఎంపికలు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకు చెందిన గ్రామీణ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల్లో సత్తాచాటారు. ఈ ఏడాది జిల్లా నుంచి 9 మంది ఎంపికయ్యారు. అయితే గత ఏడాది 15 మంది ఎంపికవగా ఈసారి సంఖ్య తక్కువగా ఉండడం గమనార్హం. జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ఎంపికైన వారి వివరాలను శనివారం ప్రకటించారు. ఈ ఏడాది జూలై 13న జిల్లాస్థాయి సెలక్షన్స్ నిర్వహించగా ప్రతిభ కనబరిచిన 47 మంది విద్యార్థులు గత నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లోని హకీంపేటలో జరిగిన రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌కు వెళ్లారు. అక్కడ సత్తాచాటిన వారిలో 9 మంది వివిధ స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికయ్యారు. వారికి ఈనెల 4, 5 తేదీల్లో ర్యాంకుల వారీగా కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. వీరికి ఆయా స్పోర్ట్స్ స్కూళ్లలో చదువుతోపాటు వసతి సౌకర్యం కల్పిస్తారు. మూడేళ్లపాటు శిక్షణ అందజేసి అనంతరం వారు ఎంచుకున్న క్రీడల్లో మెరుగైన శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతారు.

ఎంపికైన విద్యార్థులు

4వ తరగతిలో పాశంసాయి (నవాబ్‌పేట), సహస్ర (మహబూబ్‌నగర్), జి.పావని (చిన్నచింతకుంట) 5వ తరగతిలో....కె.జగన్ (రాజాపూర్), జి.అఖిల్ (మిడ్జిల్), జె.కార్తీక్ (బాలానగర్), ఎం.లక్ష్మి, ఎన్.గౌతమి (చిన్నచింతకుంట), దివ్య (మహబూబ్‌నగర్).

వనపర్తి నుంచి 11 మంది..

వనపర్తిటౌన్: రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలలకు వనపర్తి జిల్లా నుంచి 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో 4వ తరగతికి సంబంధించి జె. సాయిరుత్విక్, వై. మహేష్, ఎస్. నరేష్, జి. వర్షిత్, ఎస్. స్వామి, ఎస్. ఝాన్సీరాణి, 5వ తరగతికి సంబంధించి వి. సురేష్ నాయక్, ఆర్. విహాన్, సూరజ్‌గౌడ్, కె. లావణ్య, ఎం. శ్రీనిఖి లాక్షి ఉన్నారు.

నాగర్‌కర్నూల్ నుంచి నలుగురు

కందనూలు : క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం జిల్లా నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు యువజన, క్రీడల శాఖ అధికారి సీతారామ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారిలో 4వ తరగతి కోసం మేఘనాథ్, శిరీష ఎంపిక కాగా, 5వ తరగతిలో ప్రవేశాల కోసం కె అభినయ్ రెడ్డి, సాయి విరాట్ ఉన్నట్లు వివరించారు.

మొదటిసారిగా పాల్గొన్న



మొదటిసారిగా జిల్లా, రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్‌లో పాల్గొన్న. స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనందుకు ఆనందంగా ఉంది. ఎంపికల కోసం రెండేళ్ల నుంచి మెయిన్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న. పెద్దయ్యాక మంచి క్రీడాకారిణి అవుతా.

– కె.సహస్ర, మహబూబ్‌నగర్

సంతోషంగా ఉంది



జిల్లా, రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికకావాలని మెయిన్ స్టేడియంలో సునీల్‌సార్ వద్ద శిక్షణ తీసుకున్న. 5వ తరగతిలో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనందుకు సంతోషంగా ఉంది.

– జి.అఖిల్, మహబూబ్‌నగర్

ఎంపికైన వారికి కాల్‌లెటర్లు



జిల్లాలోని గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యం ఉంది. దానిని వెలికితీస్తే మంచి క్రీడా ఆణిముత్యాలు బయటికవస్తారు. జిల్లాకు చెందిన 9 మంది ఎంపికకావడం సంతోషంగా ఉంది. వారికి హకీంపేట క్రీడా పాఠశాల నుంచి కాల్‌లెటర్లు పంపిస్తారు. కాగా వివిధ ధ్రువపత్రాలతో విద్యార్థులు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. మిగతా వివరాల కోసం 9440656162 నంబర్‌ను సంప్రదించాలి.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

ఏకాభిప్రాయంతో ముందుకు సాగుదాం

- వినాయక చవితి, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు
- పాలకమండలి సమావేశంలో చైర్మన్ చిన్నకృష్ణయ్య

జోగుళాంబ శక్తిపీఠం: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఏకాభిప్రాయంతో ముందుకు సాగుదామని పాలకమండలి చైర్మన్ చిన్నకృష్ణయ్య అన్నారు. శనివారం ఆలయ ఈఓ పురేందర్ కుమార్ నేతృత్వంలో పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం, రథోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉభయ ఆలయాల్లో కర్పూర హారతికి బదులు నేతి ఒత్తులతో హారతి ఇవ్వడం వల్ల ఆరోగ్య సమస్యలను నివారించడంతోపాటు సంప్రదాయక పద్ధతులకు పెద్దపీట వేసినట్లు అవుతుందని తెలిపారు. పాపానాశిని దేవస్థానంలో అర్చకులను ఏర్పాటు చేసి టికెట్ల విధానం ప్రవేశపెట్టాలని సూచించారు. ఇకపై ఉభయ ఆలయాల్లో నిర్వహించే ఆర్జిత సేవలు, ప్రసాదాల కొనుగోలు, విరాళాలకు వీఓఎస్ థర్మల్ యంత్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మహా కుంభాభిషేకం, తెప్పోత్సవంలో చేపట్టాల్సిన మార్పులు, భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక లైన్ల ఏర్పాటు, ఆర్జిత సేవలు, నవరాత్రి ఉత్సవాల్లో నిరంతరాయంగా ప్రసాద వితరణ తదితర అంశాలపై చర్చించారు.

అజెండా ముందే ఎందుకు ఇవ్వరు?

దేవస్థానం అజెండాను ముందే ఇవ్వకుండా ఇప్పటికిప్పుడు అభిప్రాయం చెప్పమంటే ఎలా అని ఆలయ ధర్మకర్త అంపయ్య ప్రశ్నించారు. ప్రతిసారి సమావేశం జరిగే సందర్భంలో మాత్రమే దేవస్థానం వారు పలు విషయాలను సూచిస్తున్నారని, ముందుగా అజెండాను తమకు తెలియజేస్తే పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై అభిప్రాయాలు వెల్లడించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంపై ఈఓ స్పందిస్తూ.. అలా ముందుగా చెప్పడం కుదరదని, గతంలో కూడా ఇలాంటి పద్ధతి లేదని తేల్చిచెప్పారు. ఈ విషయంలో గత పాలకమండలిని కూడా అడిగి తెలుసుకోవచ్చని సమాధానం ఇచ్చారు. ఇక అన్నదాన విషయంలో రుచి, శుచి లేదని భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, అన్నప్రసాదంలో నాణ్యత పాటించాలని పాలకమండలి సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. బస్వాపురం, భైరాపురం చౌరస్తాలో నంది, శివుడి విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఈనెల 10న శంకుస్థాపన చేయాలని సూచించారు. ఆదాయ, వ్యయాల విషయంపై నామమాత్రంగా చర్చించారు. ఖర్చుల విషయంపై సభ్యుడు వెంకటేష్ అడిగిన ప్రశ్నలపై ఈఓతోపాటు జూనియర్ అసిస్టెంట్ శేఖర్ అసహనం వ్యక్తం చేయగా.. సదరు సభ్యుడితోపాటు మరికొందరు మౌనం వహించారు. ఆలయానికి సంబంధించిన ఏ అంశమైనా పాలక మండలి చైర్మన్‌తోపాటు సభ్యుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, వెంకటనారాయణ, చంద్రకళ, నీలప్ప, రమేష్‌బాబు, కేశన్న, సత్యన్న, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



ఆలయంలో సమావేశమైన పాలక మండలి సభ్యులు

ఉత్సాహంగా క్రికెట్ లీగ్ టోర్నీ



విజేత పర్పుల్ జట్టుతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి సమీపంలో గల క్రికెట్ మైదానంలో శనివారం ఎండీసీఏ లీగ్ టోర్నీ ఉత్సాహంగా ప్రారంభమైంది. మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో గ్రీన్ జట్టు 4 వికెట్ల తేడాతో ఎల్లో జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఎల్లో జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 8 వికెట్లకు 119 పరుగులు చేసింది. జట్టులో వరుణ్ 35, అర్జున్ 29 పరుగులు చేశారు. గ్రీన్ జట్టు బౌలర్ హర్షిత్ 4, అశోక్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన గ్రీన్ జట్టు 24.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేశారు. జట్టులో సోను 50, గణేష్ 15 పరుగులు చేశారు. రెండో మ్యాచ్‌లో పర్పుల్ జట్టు 88 పరుగుల తేడాతో ఆరెంజ్ జట్టుపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన పర్పుల్ జట్టు 25 ఓవర్లలో 9 వికెట్లకు 163 పరుగులు చేసింది. జట్టులో చైతన్య 33, మహేష్ 25 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆరెంజ్ జట్టు 13.3 ఓవర్లలో 76 పరుగులకు ఆలౌట్ అయింది. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు వెంకటరామారావు, ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కోచ్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైలులోంచి కిందపడి వ్యక్తి మృతి

రాజాపూర్: ప్రమాదవశాత్తు రైలులోంచి వ్యక్తి కిందపడి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. రైల్వేపోలీసుల కథనం ప్రకారం.. పెద్ద రాజామూర్‌కి చెందిన సాయిలు(37) దేవరకద్ర నుంచి సికింద్రాబాద్‌కు ప్యాసింజర్ రైలులో వెళ్తున్న క్రమంలో రంగారెడ్డిగూడ శివారులో ప్రమాదవశాత్తు అందులోంచి కిందపడి మృతి చెందాడు. ఘటనపై బాలానగర్ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ వివరించారు.

చికిత్సపొందుతూ... మరొకరు

దేవరకద్ర రూరల్: రైలు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం మండల పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ సయ్యద్‌అక్బర్ కథనం మేరకు... గోపన్‌పల్లి-కౌకుంట్ల రైల్వే మార్గంలో శుక్రవారం రాత్రి సమయంలో రైలు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. దీంతో అతడిని చికిత్స కోసం కొందరు తీసుకువచ్చిన కొందరు సమాచారం ఇవ్వకుండా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వదిలివెళ్లారు. కాగా తీవ్రంగా గాయపడిన అతడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వైద్య సిబ్బంది సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఆస్పత్రికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి వెళ్తున్న రైలులో నుంచి పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడికి సంబంధించి ఎలాంటి సమాచారం లభించలేదని, ఎవరైనా గుర్తిస్తే 9441273164 లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు. కాగా చికిత్స కోసం తీసుకువచ్చిన వారు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోవడం అనుమానాలకు తావిస్తోంది.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు గత నాలుగు రోజులుగా ఎలాంటి ఇన్‌ఫ్లోలు లేకపోగా.. శనివారం ఉదయం 1,159 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు చెప్పారు. సాయంత్రం 7 గంటలకు 900 క్యూసెక్కులకు తగ్గింది. నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఆవిరి రూపంలో 108 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వ ద్వారా 975 క్యూసెక్కులు, కుడి కాల్వకు 665 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 60 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,513 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 5.653 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో 851.0 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం 851.0 అడుగుల వద్ద 82.3854 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,500, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,507, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భకేంద్రంలో 6.731 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 13,464 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు వదిలారు.